



జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| బుధవారం 25 మార్చి 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 296 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|


## రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం అర్హులకు కార్డుల మంజూరు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 25, ప్రతినిధి: హైదరాబాద్‌లోని ఎఫ్‌డీసీ బోర్డు రూమ్‌లో రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ప్రెస్ అకాడమీ, ఎస్ఎంఏసీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార–పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సీహెచ్ ప్రియాంక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి జర్నలిస్టులు సమర్పించిన అక్రిడిటేషన్ దరఖాస్తులను కమిటీ సభ్యులు సమగ్రంగా పరిశీలించారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన ప్రతి జర్నలిస్టుకు కార్డులు జారీ చేస్తామని, మంజూరులో ఎలాంటి లోపం ఉండదని చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. వచ్చే నెల మొదటి వారంలో కమిటీ మరోసారి సమావేశం కానుందని, ఇంకా దరఖాస్తు చేయని అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. జిల్లాల వారీగా డీఎంఏసీ ప్రతిపాదనలను కూడా పరిశీలించి ఆమోదం తెలుపుతామని తెలిపారు. సమావేశంలో సమాచార–పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఉద్యోగులకు ఈవీ వాహనాలపై ప్రత్యేక ప్రోత్సాహకాలు – 10-20% డిస్కౌంట్

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 25, ప్రతినిధి: రాష్ట్రంలో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన ఈవీ పాలసీ భాగంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై 10 నుంచి 20 శాతం వరకు డిస్కౌంట్ కల్పిస్తున్నట్లు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సెక్రటేరియట్‌లో సీఎస్ రామకృష్ణ రావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులతో కలిసి ఈవీ వాహనాల ప్రోత్సాహక కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహీంద్రా ఎలక్ట్రిక్స్, ఆథర్ ఎనర్జీ, గ్రావిటన్ మోటార్స్, ఓలా వంటి సంస్థలు ఉద్యోగులకు రాయితీలు ఇవ్వడానికి ముందుకు వచ్చాయని వెల్లడించారు. ఈవీ పాలసీ అమలులో భాగంగా రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజుపై 100 శాతం మినహాయింపులు ఇచ్చి ఇప్పటికే లక్షా 15 వేల 551 ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించామని, దీనివల్ల 925.94 కోట్ల రూపాయల మేరకు ప్రభుత్వం ఆదాయం వదులుకున్నప్పటికీ పర్యావరణ పరిరక్షణకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఈవీ వినియోగం 0.60 శాతం నుండి 1.50 శాతానికి పెరిగిందని తెలిపారు. ప్రభుత్వ శాఖలు కొనుగోలు చేసే వాహనాలు కూడా ఈవీలే ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైతే హైర్ పద్ధతిలో వాహనాలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను విస్తరించడంతో పాటు సాంప్రదాయ ఇంధనాలపై ఆధారాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సిఎస్ రామకృష్ణ రావు మాట్లాడుతూ నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు ఈవీ వాహనాల వినియోగాన్ని పెంచుతున్నామని, సుమారు 2 వేల కిలోమీటర్ల మేర ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. హైదరాబాద్ వంటి పెద్ద నగరాల్లో గాలి నాణ్యత తగ్గుతున్న నేపథ్యంలో ఈవీ పాలసీ ద్వారా కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.



## శాసన మండలిలో బీసీ అంశాలపై తీన్మార్ మల్లన్న గర్జన బడ్జెట్‌పై తీవ్ర విమర్శలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 25, ప్రతినిధి: రాష్ట్ర శాసన మండలిలో బీసీలకు కేటాయింపులు, విద్యార్థుల సంక్షేమం, సామాజిక న్యాయం అంశాలపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీవ్రంగా స్పందించారు. బడ్జెట్‌లో బీసీలకు కేటాయించిన నిధులపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ బలహీన వర్గాల ప్రతినిధిగా సభలో కూర్చోవడం సిగ్గుగా ఉందని వ్యాఖ్యానించారు. బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, గత రెండేళ్లలో విద్య రంగానికి కేటాయించిన నిధుల్లో వేల కోట్లు ఖర్చు చేయకుండా మిగిల్చినట్లు ఆరోపించారు. శాసన మండలిలో మాట్లాడుతున్న సమయంలో తనను అడ్డుకున్నారని పేర్కొంటూ బీసీ సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీలలో ప్రొఫెసర్ల నియామకాల్లో సామాజిక సమానత్వం లేదని, అధిక శాతం ఒకే వర్గానికి చెందిన వారే ఉన్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక అసమానతలు పెరిగాయని, బీసీలకు న్యాయం జరగాలంటే సరైన కేటాయింపులు అవసరమని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కూడా ఆందోళన వ్యక్తం చేస్తూ అధిక అప్పులు తీసుకోవడం వల్ల రాష్ట్రం ఆర్థికంగా బలహీనపడిందని విమర్శించారు. బీసీలకు వారి వాటా దక్కే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



## ప్రధానిపై ‘ఇన్‌ఫిల్ట్రేటర్’ వ్యాఖ్యల వివాదం బెంగాల్ రాజకీయాల్లో వేడి

సందేశం టైమ్స్, కోల్‌కతా/న్యూఢిల్లీ, మార్చి 25, ప్రతినిధి: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇటీవల చేసిన “బిగ్గెస్ట్ ఇన్‌ఫిల్ట్రేటర్” వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీశాయి. ఈద్ సందర్భంగా కోల్‌కతాలో జరిగిన సభలో ప్రధాని నరేంద్ర మోదీపై ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో వివాదాస్పదమయ్యాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకోబడిన ప్రధానిని ఇలాంటి పదాలతో అభివర్ణించడం కోట్లాది భారతీయుల తీర్పును ప్రశ్నించినట్టేనని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బెంగాల్‌లో ఓటర్ లిస్ట్ సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై టీఎంసీ, బీజేపీ మధ్య తీవ్ర విభేదాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వచ్చాయి. నిజమైన ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారని టీఎంసీ ఆరోపిస్తుండగా, అక్రమ చొరబాటుదారులను తొలగిస్తున్నామని బీజేపీ వాదిస్తోంది. గతంలో “ఇన్‌ఫిల్ట్రేటర్స్” అంశాన్ని ప్రస్తావించిన బీజేపీకి కౌంటర్‌గా మమతా బెనర్జీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు రాజకీయ విశ్లేషణలు చెబుతున్నాయి. రాబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మైనారిటీ ఓటర్లను ఆకర్షించే వ్యూహంలో భాగంగానే ఈ వ్యాఖ్యలు వచ్చినట్లు భావిస్తున్నారు. మరోవైపు బీజేపీ ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ప్రధానిపై అవమానకర వ్యాఖ్యలుగా అభివర్ణించింది. వ్యక్తిగత విమర్శలకు ప్రాధాన్యం ఇస్తూ పశ్చిమ బెంగాల్‌లోని అసలు ప్రజా సమస్యలపై మౌనం పాటిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా సమస్యలపై చర్చకు బదులుగా వ్యక్తిగత దూషణల వైపు రాజకీయాలు మళ్లడం ప్రజాస్వామ్యానికి హానికరమని నిపుణులు సూచిస్తున్నారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించడం ప్రతి రాజకీయ నాయకుడి బాధ్యత అని వారు స్పష్టం చేశారు. దీంతో బెంగాల్‌లో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

## ఉత్తరాంధ్రలో భారీ ఉక్కు పరిశ్రమకు శ్రీకారం అభివృద్ధి దిశగా ఏపీ ముందడుగు




సందేశం టైమ్స్, అమరావతి/అనకాపల్లి, మార్చి 25, ప్రతినిధి: రాష్ట్రంలో అభివృద్ధి, పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగా ఉత్తరాంధ్రలో ప్రతిష్టాత్మక ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు ప్రభుత్వం వెల్లడించింది. రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో నిర్మాణం కానున్న ఈ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఉత్తరాంధ్రను ఉక్కు ఆంధ్రాగా మారుస్తుందని పేర్కొంది. గతంలో కబ్జాలు, కూల్చివేతలు, కేసులతో భయాందోళనలకు గురైన ఈ ప్రాంతంలో ఇప్పుడు అభివృద్ధి, అవకాశాలు, భవిష్యత్‌పై నమ్మకం పెరిగిందని తెలిపింది. విశాఖ ఉక్కు పరిశ్రమ ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచినట్లే, అనకాపల్లి జిల్లాలో ఏర్పడుతున్న ఈ కొత్త పరిశ్రమ ఉత్తరాంధ్ర భవిష్యత్తుకు నూతన దిశను చూపుతుందని అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే తక్కువ సమయంలో ఈ భారీ ప్రాజెక్ట్ సాధ్యమైందని, ముడి ఖనిజాల సరఫరా నుంచి అనుమతుల వరకు వేగవంతమైన నిర్ణయాలు తీసుకున్నట్లు పేర్కొంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా లక్షలాది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, వచ్చే మూడు సంవత్సరాల్లో ప్రాంతంలో అన్ని రంగాల్లో అభివృద్ధి కనిపిస్తుందని వెల్లడించింది. దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌లలో ఒకటిగా నిలవనున్న ఈ ప్రాజెక్ట్‌తో ఆంధ్రప్రదేశ్ ఉక్కు రంగంలో అగ్రస్థానానికి చేరుకునే అవకాశం ఉందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

## వికలాంగుల దీక్షకు బీఆర్‌ఎస్ మద్దతు ఇందిరాపార్క్ వద్ద పాల్గొననున్న కేటీఆర్



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 25, ప్రతినిధి: హైదరాబాద్‌లో వికలాంగుల హక్కుల సాధన కోసం జరుగుతున్న దీక్షకు బీఆర్‌ఎస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ మాట్లాడుతూ రేపు ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే వికలాంగుల దీక్షలో పాల్గొంటానని తెలిపారు. వికలాంగుల సంఘాల నాయకులతో సమావేశమైన ఆయన, కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు కోసం అసెంబ్లీలో చర్చకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం కలిసి పోరాడుతామని పేర్కొన్నారు. వికలాంగులు ధైర్యంగా తమ హక్కుల కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా వికలాంగుల వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నే పోచయ్య మాట్లాడుతూ అన్ని సంఘాలు ఏకమై బాధ్యతగా దీక్షలో పాల్గొనాలని కోరారు.







## ద్విచక్ర వాహనాలపై పోలీసుల గస్తీ గ్రామాల్లో నేరాలకు అడ్డుకట్ట

సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా, మానూర్ మండలం, మార్చి 25, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా మానూర్ మండల గ్రామీణ ప్రాంతాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు చురుకుగా వ్యవహరిస్తున్నారు. మానూర్ ఎస్సై కోటేశ్వరరావు ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది ద్విచక్ర వాహనాలపై హెల్మెట్లు ధరించి గ్రామ పరిసరాల్లో విస్తృతంగా గస్తీ నిర్వహించారు. ప్రధాన రహదారులు, కాలనీలు, చెరువుల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై నిఘా ఉంచారు. ఈ గస్తీతో ప్రజల్లో భద్రతా భావం పెరగడంతో పాటు నేరస్థుల్లో భయం నెలకొంటోంది. పోలీసులు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ రోడ్డు భద్రతకు సంబంధించిన సూచనలు ప్రజలకు తెలియజేశారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని అవసరమైన సలహాలు అందిస్తూ విశ్వాసాన్ని పెంపొందిస్తున్నారు. ఇలాంటి నిరంతర పర్యవేక్షణతో గ్రామాల్లో చట్టవ్యవస్థ బలోపేతం కావడంతో పాటు చిన్నచిన్న వివాదాలు పెద్ద సమస్యలుగా మారకుండా ముందుగానే పరిష్కారం పొందుతున్నాయి. అనుమానాస్పద విషయాలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని అధికారులు ప్రజలను కోరుతూ, పోలీసులు-ప్రజల సమన్వయంతోనే శాంతి భద్రతలు మరింత బలపడతాయని పేర్కొన్నారు.

## మేళ్లచెరువులో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహణ






సందేశం టైమ్స్, మేళ్లచెరువు, మార్చి 25, ప్రతినిధి: మాస్టర్ ఇ.కె ఆధ్యాత్మిక సేవా సంస్థ ఖమ్మం శాఖ ఆధ్వర్యంలో మేళ్లచెరువు గ్రామంలోని శివాలయంలో మార్చి 26 గురువారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లలు, పెద్దలు, మహిళలను వైద్యులు ఉచితంగా పరీక్షించి అవసరమైన వైద్య సలహాలు అందించడంతో పాటు హోమియోపతి మందులను కూడా ఉచితంగా పంపిణీ చేయనున్నారు. గ్రామస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## బోరంచ నల్ల పోచమ్మ జాతర ఏర్పాట్లకు వ్యాపారుల సహకారం



సందేశం టైమ్స్, మనూర్ మండలం, మార్చి 25, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా మనూర్ మండలంలోని శ్రీ శ్రీ శ్రీ బోరంచ నల్ల పోచమ్మ అమ్మవారి 7 వారాల మహా జాతర సమీపిస్తున్న నేపథ్యంలో భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా బారికేడ్లు ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్ చందానగర్‌కు చెందిన నత్తు & సన్స్ జువెల్లరి ప్రముఖ బంగారం వ్యాపారులు రాజు రిజ్వానీ, రాజేష్ రిజ్వానీ, సూరజ్ రిజ్వానీ ముందుకు వచ్చారు. అదనంగా భారీ గేట్లు, బ్యానర్లు ఏర్పాటు చేయనున్నట్లు వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది శేఖర్ వారిని శాలువాతో సత్కరించి, అమ్మవారి ఫోటోను బహుమతిగా అందజేశారు.

## టీబీ రహిత జిల్లాయే లక్ష్యం – సంగారెడ్డిలో ‘TB ముక్త్ భారత్ అభియాన్ v2.0’ ప్రారంభం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 25, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో టీబీ రహిత తెలంగాణ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. ప్రావీణ్య పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి సబ్ సెంటర్ వద్ద మంగళవారం అవగాహన ర్యాలీకి జెండా ఊపి 100 రోజుల ‘TB ముక్త్ భారత్ అభియాన్ v2.0’ కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీబీ పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని, ప్రజల్లో అవగాహన పెంపుతో నిర్మూలన సాధ్యమని పేర్కొంటూ, జిల్లాలో మే 15 వరకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు. అధిక ప్రభావిత ప్రాంతాల్లో ఇంటింటి సర్వేలు, 14 ఏళ్లు పైబడిన వారు, గర్భిణీలు, రక్తహీనతతో బాధపడుతున్న మహిళలకు ప్రత్యేక స్క్రీనింగ్ నిర్వహిస్తున్నామని, మొబైల్ ఎక్స్-రే ద్వారా తక్షణ నిర్ధారణ చేసి ఉచిత చికిత్స అందిస్తున్నామని వెల్లడించారు. లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించాలని సూచించారు. ర్యాలీలో విద్యార్థులు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొని టీబీ నివారణపై నినాదాలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా. వసంత్ రావు, జిల్లా టిబి అధికారి డా. అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నో – పర్యావరణ రక్షణలో యువత ముందుండాలి




సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 25, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరాకరించి పర్యావరణ పరిరక్షణలో యువత ముందుండాలని వక్తలు పిలుపునిచ్చారు. గుమ్మడిదల మండలంలోని మిలీనియం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సంగారెడ్డి ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో “ప్లాస్టిక్ అలవాటును విడనాడండి – సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నో చెప్పండి” అనే అంశంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ పి. శిరీష ప్లాస్టిక్ వ్యర్థాల పెరుగుతున్న సమస్య, ప్లాస్టిక్ వ్యర్థ నిర్వహణ నియమాలు–2016, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీ (EPR) విధానాల ప్రాముఖ్యతను వివరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను తెలియజెప్పి విద్యార్థులు ప్లాస్టిక్ రహిత జీవన విధానాన్ని అవలంబించాలని సూచించారు. కళాశాల ప్రతినిధి జైపాల్ రెడ్డి పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 60 మంది విద్యార్థులు, అధికారులు, సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.




## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి: జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పిలుపు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 25, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. క్షణికావేశంలో జరిగిన తప్పులను సరిదిద్దుకునేందుకు లోక్ అదాలత్ మంచి అవకాశమని పేర్కొంటూ, పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన కేసుల్లో కక్షిదారులు పరస్పర అవగాహనతో సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన, కుటుంబ, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్, విద్యుత్ చౌర్యం వంటి కేసుల్లో ఇరువర్గాల సమ్మతితో రాజీ కుదుర్చుకోవచ్చని చెప్పారు. సైబర్ నేరాల్లో రూ.25,000లోపు నష్టపోయిన బాధితులు లోక్ అదాలత్ ద్వారా ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే రీఫండ్ పొందే అవకాశం ఉందని వెల్లడించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఎక్కువ కేసులను పరిష్కరించాలని, ప్రజల్లో అవగాహన పెంచాలని ఎస్పీ సూచించారు.

## గుమ్మడిదలలో కలెక్టర్ ప్రావీణ్య విస్తృత పర్యటన – ఆరోగ్యం, గృహ నిర్మాణం, సేవలపై సమీక్ష



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 25, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం గుమ్మడిదల మండలంలో విస్తృత పర్యటిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ల్యాబ్, ఫార్మసీ సహా అన్ని విభాగాలను సందర్శించి సేవలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆమె, డేటా నమోదు ఖచ్చితంగా ఉండాలని, సాంకేతిక సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం నల్లవల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన గృహాన్ని సందర్శించి లబ్ధిదారుతో మాట్లాడి నిర్మాణ నాణ్యతపై ప్రశంసలు తెలిపారు. తరువాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలు, సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులపై తహసిల్దార్‌తో సమీక్ష నిర్వహించి, రెవెన్యూ సేవలు పారదర్శకంగా, వేగవంతంగా అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పరమేశ్వర్, సర్పంచ్ రాణి సురేష్, వైద్య–ఆరోగ్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వర్షాధారిత పథకంతో రైతులకు ఆధునిక సాయం నల్లవెల్లిలో కలెక్టర్ ప్రావీణ్య పర్యటన

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 25, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో వర్షాధారిత అభివృద్ధి పథకంతో రైతులు సమగ్ర వ్యవసాయ పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు, ఆదాయం సాధించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. గుమ్మడిదల మండలం నల్లవెల్లి గ్రామంలో అమలవుతున్న పథకాన్ని మంగళవారం పరిశీలించిన ఆమె, రైతులకు అందిస్తున్న ఆధునిక పరికరాలు, రాయితీల వినియోగాన్ని క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. రైతు కూర్మ కొమురయ్య కూరగాయల పొలాన్ని సందర్శించి పరికరాల వినియోగంపై వివరాలు తెలుసుకుని, పథకం ద్వారా లభిస్తున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం కింద 115 మంది లబ్ధిదారులకు సుమారు రూ.32.10 లక్షల విలువైన ప్లాస్టిక్ క్రేట్లు, వర్మీ బెడ్స్, తేనెటీగల పెంపక బాక్సులు వంటి పరికరాలు అందజేసినట్లు తెలిపారు. రైతులు సమగ్ర వ్యవసాయ పద్ధతులు పాటించి, రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి సమిష్టిగా మార్కెటింగ్ చేయాలని, విలువ ఆధారిత ఉత్పత్తులతో ఆదాయం పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు, ఎంపీడీఓ ఉషారాణి, ఎంఆర్ఓ పరమేశ్వర్, ఇతర అధికారులు, సర్పంచ్ రాణి సురేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## రెండు రోజులు పొడి వాతావరణం 26 నుంచి 29 వరకు వర్షాల సూచన



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 25, ప్రతినిధి: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి మరియు ఉత్తరాంధ్ర తీర ప్రాంతంలో ఉన్న ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో పొడి వాతావరణం కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అయితే ఈ నెల 26 నుంచి 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఆదిలాబాద్, కుమ్రంభీం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు పేర్కొంది. వచ్చే 48 గంటలలో ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉండనున్నది. గడిచిన 24 గంటల్లో భద్రాద్రి కొత్తగూడెం, జనగామ, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సంగారెడ్డి జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురవగా, అత్యధికంగా అశ్వారావుపేటలో 2.52 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం తెలిపింది.




## సంగారెడ్డి డీసీసీబీ బడ్జెట్‌కు ఆమోదం రుణాల వసూళ్ల వేగవంతానికి కలెక్టర్ ఆదేశాలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 25, ప్రతినిధి: ఉమ్మడి మెదక్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) ఆధ్వర్యంలో బ్యాంకుల లావాదేవీలు, ఆర్థిక పరిస్థితిపై జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో బ్యాంకు ఆర్థిక స్థితిగతులు, ఆదాయం-ఖర్చుల సమతుల్యత, రుణాల మంజూరు, వసూళ్ల పురోగతిపై విస్తృతంగా చర్చించబడింది. పెండింగ్ రుణాల రికవరీని వేగవంతం చేయాలని, రైతులు మరియు ఖాతాదారులకు నాణ్యమైన బ్యాంకింగ్ సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జరిగిన మహాజన సభలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.75,24,60,000 బడ్జెట్‌ను ఆమోదిస్తూ, డిపాజిట్ల వృద్ధి, లోన్ రికవరీలు, పిఎసిఎస్ సంఘాల ద్వారా వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాల పంపిణీతో పాటు వ్యవసాయ యంత్రీకరణను ప్రోత్సహించాలని, రూరల్ హౌసింగ్ తదితర పథకాల రుణాల వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో 83 పిఎసిఎస్ సంఘాలు డీసీసీబీతో అనుబంధంగా పనిచేస్తుండగా, నాబార్డ్ సహకారంతో 38 ఏటీఎంలు, 3 మొబైల్ ఏటీఎంలు ఏర్పాటు చేసి యూపీఐ సేవలు అందిస్తున్నట్లు సీఈఓ సురేష్ తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో డిపాజిట్లు సుమారు 11.54 శాతం వృద్ధి సాధించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాబార్డ్ జీఎం కృష్ణ చైతన్య, టీజీసీఏబీ సురేఖ, డీసీఓ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రేశ్వర స్వామి ఆలయం సమీపంలో చెత్త దహనం – భక్తుల ఆందోళన






సందేశం టైమ్స్, పటాన్చెరు మండలం, మార్చి 25, ప్రతినిధి: పటాన్చెరు మండలంలోని ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఇంద్రేశ్వర స్వామి ఆలయం సమీపంలో చెత్తను వేయడం, దహనం చేయడం వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 120 ఏళ్ల క్రితం నిర్మించబడిన ఈ శివాలయాన్ని స్థానికులు అభివృద్ధి చేసి పునర్వైభవాన్ని తీసుకొచ్చినప్పటికీ, ఆలయానికి సుమారు 150 మీటర్ల దూరంలో మున్సిపల్ చెత్తను పేరుకుపోయి దహనం చేయడం వల్ల ప్లాస్టిక్ పొగ వాసన భక్తులను ఇబ్బంది పెడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా చెత్తను వీధి కుక్కలు చెరువు వద్దకు తీసుకువచ్చి పడవేయడంతో ఆలయం ముందు ఉన్న చెరువు కూడా కలుషితమవుతోందని పేర్కొన్నారు. వెంటనే చెత్తను ఆలయం నుండి దూరంగా తరలించి, భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని, ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యతను అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## మన్యలక్ష్మి ఆధ్వర్యంలో నాలుగో వార్డులో ఎల్ఈడి వీధి లైట్ల ఏర్పాటు



సందేశం టైమ్స్, పటాన్చెరు, మార్చి 25, ప్రతినిధి: పటాన్చెరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీ నాలుగో వార్డులో కౌన్సిలర్ మన్యలక్ష్మి పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డులో ఎల్ఈడి వీధి లైట్లను ఏర్పాటు చేయించారు. అనంతరం వార్డు ప్రజలతో సమావేశమై, ప్రాంతంలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కారం కోసం కృషి చేస్తానని కౌన్సిలర్ మన్యలక్ష్మి తెలిపారు.

## ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్ సత్వర న్యాయం పొందండి



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 25, ప్రతినిధి: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీ (శనివారం) నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకుని సత్వర, సమన్యాయం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శ్రీమతి జి. భవాని చంద్ర తెలిపారు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా సంగారెడ్డి, జహీరాబాద్, జోగిపేట్, నారాయణఖేడ్ కోర్టుల్లో ఈ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పేర్కొంటూ, ప్రజలు, కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పెండింగ్ కేసులను సులభంగా పరిష్కరించుకోవాలని ఆమె కోరారు.

## టీబీ రహిత జిల్లానే లక్ష్యం – సూర్యాపేటలో అవగాహన ర్యాలీ ప్రారంభం






సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 25, ప్రతినిధి: క్షయ (టీబీ) వ్యాధిని పూర్తిగా నిర్మూలించి జిల్లాను టీబీ రహితంగా మార్చేందుకు సమిష్టి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం గాంధీ పార్క్ నుండి ప్రభుత్వ వైద్య కళాశాల వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టీబీ నిర్ధారణకు అవసరమైన అన్ని పరీక్షా సదుపాయాలు, చికిత్సా ఏర్పాట్లు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రూ.20 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన మొబైల్ ఎక్స్‌రే యంత్రం ద్వారా జనవరి 2025 నుండి జిల్లా వ్యాప్తంగా 52,901 మందికి పరీక్షలు నిర్వహించగా, వారిలో 1,741 మందికి వ్యాధి నిర్ధారణ అయిందని, 1,356 మంది పూర్తిగా కోలుకోగా ప్రస్తుతం 385 మంది చికిత్స పొందుతున్నట్లు వివరించారు. జిల్లాలో 21 గ్రామపంచాయతీలను టీబీ ముక్తి గ్రామాలుగా గుర్తించామని, భవిష్యత్తులో మరిన్ని గ్రామాలు, మండలాలను టీబీ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ 'టీబీ వారియర్లుగా' పనిచేయాలని సూచించారు. లక్ష్య సాధనలో ముందున్న పిహెచ్‌సీలకు రూ.లక్ష ప్రోత్సాహకం, మూడు టీబీ యూనిట్ల అభివృద్ధికి రూ.3 లక్షల చొప్పున నిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా టీబీ ముక్తి గ్రామాల సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, వైద్య సిబ్బందిని ప్రశంసాపత్రాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీఎంహెచ్వో డా. వెంకటరమణ, ప్రోగ్రాం అధికారి డా. ప్రసీద్, డా. నాజియా తబస్సుమ్, హెచ్వోడిలు డా. గురురాజు, డా. ఈశ్వరమ్మ, డా. శ్రీకాంత్ భట్, డా. జనార్ధన్, పల్మనాలజిస్ట్ డా. వెంకట పాపిరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓలు డా. జి. చంద్రశేఖర్, డా. మాధవ్ కుమార్, ఆర్డీవో వేణు మాధవ్, వైద్యాధికారులు, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## సకాలంలో పరిశ్రమలకు అనుమతులు ఇవ్వాలి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 25, ప్రతినిధి: జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీఐపీసీ, టీఎస్ఐపాస్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త పరిశ్రమల దరఖాస్తులను పరిశీలించి సింగిల్ విండో విధానంలో వేగంగా అనుమతులు ఇవ్వాలని సూచించారు. జిల్లాలో 36 పరిశ్రమలకు సంబంధించి వివిధ శాఖల నుంచి 63 అనుమతులు వచ్చినట్లు పేర్కొంటూ, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు తక్షణమే ఆమోదించాలని అధికారులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించిన టీప్రైడ్ పథకం కింద 82 యూనిట్లకు అనుమతులు మంజూరు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్పీ నరసింహ, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ టి. సీతారాం, కమర్షియల్ టాక్స్ అధికారి బి. యాదగిరి, డీపీవో కె. యాదగిరి, ఎస్సీ అభివృద్ధి అధికారి దయానంద రాణి, ఎస్టీ అభివృద్ధి అధికారి కె. శంకర్, ఫ్యాక్టరీస్ ఇన్స్పెక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలు భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్


సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 25, ప్రతినిధి: జిల్లాలో ఉన్న అన్ని పరిశ్రమలు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ పరిశ్రమల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమలలో యంత్రాల సేఫ్టీ నిబంధనలను నిరంతరం పాటించడంతో పాటు కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పరిశ్రమల కార్యకలాపాలు ప్రజల భద్రతకు ఎలాంటి భంగం కలగకుండా అధికారులతో సమన్వయం చేసుకుని నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ కె. నర్సింహ మాట్లాడుతూ పరిశ్రమలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, భారీ వాహనాల డ్రైవర్లకు సేఫ్టీ శిక్షణ ఇవ్వాలని సూచించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ టి. సీతారాం, కమర్షియల్ టాక్స్ అధికారి బి. యాదగిరి, డీపీవో కె. యాదగిరి, ఎస్సీ అభివృద్ధి అధికారి దయానంద రాణి, ఎస్టీ అభివృద్ధి అధికారి కె. శంకర్, ఫ్యాక్టరీస్ ఇన్స్పెక్టర్ శ్రీదేవి తదితర అధికారులు పాల్గొన్నారు.

## పరిశ్రమల భద్రతపై సమగ్ర సమీక్ష – "జీరో హార్మ్" లక్ష్యంతో ముందుకు సాగాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 25, ప్రతినిధి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆధ్వర్యంలో G.O. Rt. No. 331 ప్రకారం నియమిత కమిటీ సభ్యులు దశలవారీగా నిర్వహించిన తనిఖీలపై సమగ్ర భద్రతా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరిశ్రమల భద్రత, రోడ్డు భద్రత, అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్, సిమెంట్ ఫ్యాక్టరీలు, సుధాకర్ పీవీసీ వంటి పరిశ్రమల నుంచి వచ్చే భారీ వాహనాల రాకపోకలలో రోడ్డు భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఫ్యాక్టరీ ప్రాంగణంలోకి ప్రవేశించే ముందు మరియు బయటకు వెళ్లే సమయంలో డ్రైవర్లకు మద్యం సేవించి వాహనం నడపకుండా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అన్ని పరిశ్రమలు తమ ఆన్‌సైట్ అత్యవసర ప్రణాళికలను కలెక్టర్‌కు సమర్పించాలని, పరిశ్రమల యాజమాన్యాలు మరియు జిల్లా పరిపాలన మధ్య సమన్వయం కోసం జీఎండీఐసీ ఆధ్వర్యంలో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని సూచించారు. కంప్లయెన్స్ నివేదికలను సమయానికి సమర్పిస్తూ, ఆన్‌సైట్, ఆఫ్‌సైట్ మాక్ డ్రిల్స్‌ను నిరంతరం నిర్వహించాలని పేర్కొన్నారు. "ప్రమాదం కంటే భద్రత చవకైనది" అనే భావనతో "జీరో హార్మ్" లక్ష్యాన్ని సాధించాలని, ప్రతి ఒక్కరూ భద్రతా నిబంధనలు పాటిస్తూ సేఫ్ మాన్ అవర్స్‌తో పనిచేయాలని తెలిపారు. "ఒక జిల్లా–ఒక ఉత్పత్తి" కార్యక్రమం కింద సూర్యాపేటలో బియ్యం, సిమెంట్, మిరపకాయలను ఎగుమతి దృష్టితో అభివృద్ధి చేయాలని సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ కే. నరసింహ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కార్మికుల వివరాలను సేకరించి అవసరమైతే పోలీసు సహకారంతో ప్రవర్తనా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, వాహన డ్రైవర్లకు కంటి చూపు పరీక్షలు చేయించాలని, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు, ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో భద్రతా శిక్షణ నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ టి. సీతారాం, ఫ్యాక్టరీస్ ఇన్స్పెక్టర్ శ్రీదేవి, కమర్షియల్ టాక్స్ అధికారి బి. యాదగిరి, డీపీవో కె. యాదగిరి, ఎస్సీ అభివృద్ధి అధికారి దయానంద రాణి, ఎస్టీ అభివృద్ధి అధికారి కె. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ పతక విజేతలకు నియామక పత్రాలు – క్రీడాకారులకు ప్రోత్సాహం



సందేశం టైమ్స్, లక్నో, మార్చి 25, ప్రతినిధి: "యోగః కర్మసు కౌశలం" అనే సందేశంతో అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు నియామక పత్రాలు మరియు నగదు బహుమతులు పంపిణీ చేసే కార్యక్రమం లక్నోలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా క్రీడాకారులు మరింత కృషి చేసి దేశానికి గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు. కష్టపడి సాధన చేస్తూ అత్యున్నత స్థాయికి చేరుకుని మరిన్ని పతకాలు సాధించాలని సూచించారు. క్రీడాకారుల ప్రతిభను అభినందిస్తూ, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రతి అడుగులో వారికి తోడుగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన క్రీడా ప్రముఖులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.



## మోడీ చిత్రపటానికి పాలాభిషేకం – చింతకానిలో బీజేపీ నేతల సంబరాలు

సందేశం టైమ్స్, ఖమ్మం జిల్లా, చింతకాని, మార్చి 25, ప్రతినిధి: దేశ చరిత్రలో అత్యధిక కాలం ప్రభుత్వ అధినేతగా సేవలందించిన నాయకుడిగా రికార్డు సృష్టించిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి చింతకాని బీజేపీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. మండల అధ్యక్షుడు కొండా గోపి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముస్లిం జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు షేక్ సిద్దుమియా చేతుల మీదుగా పాలాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చంబ్లీ 8,930 రోజుల రికార్డును మోడీ అధిగమించి 8,931 రోజులు పూర్తి చేసి కొత్త చరిత్ర సృష్టించారని తెలిపారు. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మోడీ అప్పటి నుంచి నిరంతరంగా నాయకత్వం వహిస్తున్నారని, 2014లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టి పూర్తి మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తొలి కాంగ్రెస్‌ేతర నేతగా నిలిచారని పేర్కొన్నారు. దేశం, ధర్మమే లక్ష్యంగా ప్రజలను కుటుంబ సభ్యులుగా భావిస్తూ సేవలందిస్తున్న మోడీకి మరింత శక్తి కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడి సత్యనారాయణ, గోదా, బక్క సత్యమూర్తి, కొండా వెంకన్న, కోరిపల్లి శ్రీను, కోట సికిందర్, బుర్ర శ్రీను, తాటికొండ రామకృష్ణ, సత్తెనపల్లి గోపి, అంజనా సిద్ధార్థ, గోపాలరావు, నాగయ్యా, వలసుకొండ నరసింహారావు, పాముర్తి శ్రీను, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎకరం లోపు రైతులకు ముందుగా రైతు భరోసా – రూ.3,446 కోట్ల నిధుల విడుదల




సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 25, ప్రతినిధి: రాష్ట్రంలో ఎకరం వరకు భూములు కలిగిన రైతులకు ముందుగా రైతు భరోసా సాయం అందించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. మొత్తం 68,89,955 మంది రైతులకు సంబంధించిన 57,44,907 ఎకరాలపై రూ.3,446.94 కోట్లను విడుదల చేశారు. ఆదివారం నర్మెట్టలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అనంతరం జరిగిన సభలో ఈ నిధులను ప్రకటించారు. బ్యాంకులకు సెలవు ఉండటంతో సోమవారం రైతుల ఖాతాల్లోకి ఈ మొత్తం జమ కానుంది. మిగిలిన రూ.5,400 కోట్లను వచ్చే 45 రోజుల్లో రెండు విడతల్లో విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఎకరానికి సంవత్సరానికి రూ.12 వేల చొప్పున, యాసంగి సీజన్‌కు రూ.6 వేల చొప్పున రైతులకు సాయం అందుతుంది. రైతు భరోసా నిధుల్లో నల్గొండ జిల్లా ముందంజలో నిలిచింది. ఈ జిల్లాలో 5,22,313 మంది రైతులకు రూ.268.57 కోట్లు జమ కానుండగా, ఖమ్మం జిల్లాలో 3.35 లక్షల మందికి రూ.169.51 కోట్లు, సంగారెడ్డి జిల్లాలో 3.53 లక్షల మందికి రూ.167.80 కోట్లు, నాగర్ కర్నూల్ జిల్లాలో 3.01 లక్షల మందికి రూ.157.95 కోట్లు, సిద్దిపేట జిల్లాలో 3.53 లక్షల మందికి రూ.153.44 కోట్లు జమ కానున్నాయి. అత్యల్పంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో రూ.10.43 కోట్లు జమ కానున్నాయి.

## నేడు గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 25, ప్రతినిధి: తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీసెట్-2026) ఫలితాలు నేడు ప్రకటించనున్నట్లు ఎస్సీ గురుకులాల సొసైటీ అధికారులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 1:30 గంటలకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఫలితాలను విడుదల చేయనున్నారని వెల్లడించారు. 2026-27 విద్యా సంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలు, అలాగే 6వ నుండి 9వ తరగతుల వరకు ఖాళీ సీట్ల భర్తీ కోసం ఈ పరీక్ష నిర్వహించగా, మొత్తం 1,82,061 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 1,72,842 మంది పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

## రైతు రుణమాఫీపై ప్రతిపాదన లేదు – కేంద్రం స్పష్టం



సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, మార్చి 25, ప్రతినిధి: రైతు రుణమాఫీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి ప్రస్తుతం ఎటువంటి ప్రతిపాదన లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ స్పష్టం చేశారు. రుణమాఫీ కంటే రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు, పీఎం కిసాన్ నిధులు, తక్కువ వడ్డీ రుణాల వంటి పథకాల ద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రాధాన్యమని తెలిపారు. అదేవిధంగా పూచీకత్తు లేని రుణాల పరిమితిని రూ.2 లక్షలకు పెంచినట్లు పేర్కొన్నారు. ఈ ప్రకటనతో రుణమాఫీ అమలవుతుందని ఆశించిన రైతుల్లో నిరాశ నెలకొంది.

## వికలాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ నారాయణఖేడ్ పునర్వాస కేంద్రంపై ఆందోళన



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 25, ప్రతినిధి: నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానసిక వికలాంగుల పునర్వాస కేంద్రంలో కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ (సీఆర్పీ)గా వికలాంగులకే నియామకం చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ, సకలాంగులను నియమించడం వల్ల వికలాంగులకు అన్యాయం జరుగుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో శిల్ప అనే వికలాంగురాలు సీఆర్పీగా పనిచేస్తుండగా, శాతం తక్కువగా ఉందని కారణం చూపించి ఆమెను తొలగించి సకలాంగులను నియమించారని ఆరోపించారు. ఈ విషయంపై 15-09-2020న సంబంధిత సీసీకి వినతి పత్రం ఇచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా సకలాంగులకు మద్దతు ఇస్తున్నారని తెలిపారు. 2016 ఆర్పీడీ చట్టంలోని సెక్షన్ 92 ప్రకారం బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇకపై కూడా సకలాంగుల నియామకాలు కొనసాగితే మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. వికలాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరుతున్నారు.

## అనారోగ్యంతో ఉన్న కార్యకర్తను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 25, ప్రతినిధి: ఆందోల్ నియోజకవర్గ పరిధిలోని సంగారెడ్డి పట్టణంలో హోప్ న్యూరో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఇటిక్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తను ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పరామర్శించారు. రోగితో మాట్లాడి ధైర్యం చెప్పడంతో పాటు కుటుంబ సభ్యులకు మేమున్నామనే నమ్మకం కల్పించారు. ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడి చికిత్స సక్రమంగా కొనసాగేలా చూసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కార్యకర్త ఆరోగ్య పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు.



## నిరంతరంగా కొనసాగుతున్న 'సీఎం కప్' – తెలంగాణ మట్టిలోని మాణిక్యాలను గుర్తిస్తాం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 25, ప్రతినిధి: తెలంగాణ క్రీడా ప్రతిభను గుర్తించడానికి ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న 'సీఎం కప్' రాష్ట్ర స్థాయి ముగింపు వేడుకలు ఈరోజు ఎల్బీ ఇండోర్ స్టేడియంలో ఘనంగా జరిగాయి. రాష్ట్ర క్రీడా మరియు యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై, మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని మట్టిలోని మాణిక్యాలను గుర్తించేందుకే రెండు విడతలుగా నిర్వహించిన పోటీలను నిరంతర కార్యక్రమంగా కొనసాగిస్తామని తెలిపారు. కేవలం ప్రభుత్వ ప్రోత్సాహం కాకుండా క్రీడాకారుల కృషి, పట్టుదలే విజయం సాధించడానికి కీలకం అని సూచించారు.సీఎం కప్‌లో పాల్గొన్న క్రీడాకారుల ప్రతిభను గుర్తించి, అవసరమైతే స్పోర్ట్స్ అకాడమీలలో ప్రత్యేక శిక్షణ అందిస్తామని ఆయన పేర్కొన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి కూడా రాష్ట్ర క్రీడా ప్రతిభను గుర్తించడానికి సీఎం కప్ పోటీలను నిర్వహిస్తున్నామని, క్రమశిక్షణ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహిస్తామని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి పేర్కొన్నట్లు, వివిధ ప్రభుత్వ మరియు ప్రైవేట్ శాఖల సహకారంతో ఈ పోటీలు విజయవంతం అయ్యాయని చెప్పారు. మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి తెలిపినట్లుగా, దాదాపు 5.40 లక్షల మంది క్రీడాకారులు ఆన్లైన్‌లో నమోదు చేసుకుని, వారి వివరాలను క్రీడా అవసరాలకు అనుగుణంగా క్రోడీకరించడం జరిగింది.ఓవరాల్ ఛాంపియన్‌గా అదిలాబాద్ జిల్లా జట్టు నిలిచింది, రెండో స్థానంలో రంగారెడ్డి, మూడో స్థానంలో కరీంనగర్ జిల్లా నిలిచాయి. విజయులకు మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, సైనా నెహ్వాల్, సోనీ బాలాదేవిలు ట్రోఫీలు అందజేశారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల డివైఎస్ఓలు, క్రీడా సంఘాల ప్రతినిధులు, స్పోర్ట్స్ అథారిటీ కోచులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## నారాయణఖేడ్‌లో పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టులపై మంత్రి హామీ

సందేశం టైమ్స్, నారాయణఖేడ్, మార్చి 25, ప్రతినిధి: గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డా. పట్లోళ్ల సంజీవరెడ్డి తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలసి, నియోజకవర్గంలోని పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల పనుల మంజూరీ కోసం చర్చించారు. సమావేశంలో నల్లవాగు, బసవేశ్వర, సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు ప్రధాన అంశంగా కొనసాగినవి. ఎమ్మెల్యే గారు ఈ ప్రాజెక్టుల ద్వారా రైతులకు సాగునీరు అందడం ఎంత ముఖ్యమో వివరించారు, మంత్రి గారు సానుకూల స్పందనతో హామీ ఇచ్చారు. ఈ చర్చలు నారాయణఖేడ్ రైతుల సంక్షేమానికి మైలురాయిగా మారనున్నాయి.



## డి-లిమిటేషన్, 50% సీట్ల పెంపు: రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 25, ప్రతినిధి: రాష్ట్రపతి లెక్కల ప్రకారం పార్లమెంట్ సీట్లలో 50 శాతం పెంపుపై రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య సీట్ల వ్యత్యాసం ఫిక్స్ చేసుకోవాలని, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను పక్కన పెట్టి కేంద్రం వివక్ష చూపుతున్నట్టు అన్నారు. 50 శాతం సీట్ల పెంపు "ఫైనల్ బుల్లెట్" కావడంతో, కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది రాష్ట్రాల అవసరం లేకుండా పోతుందని, జాతీయ రాజకీయాల్లో దక్షిణాది నేతలకు చోటు ఇవ్వలేనంత ప్రమాదముందని హెచ్చరించారు. జనాభా ఆధారంగా సీట్ల పెంపు అయినప్పటికీ దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని, అన్ని పక్షాలతో చర్చించి ముందుకు వెళ్లాలని, నియోజకవర్గాల పెంపు దక్షిణాది రాష్ట్రాలకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ఈ అంశాన్ని దక్షిణాది రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ప్రజలకు తెలియజేస్తారని తెలిపారు.

## కూటమి ప్రభుత్వం రైతుల పంటలను కొనుగోలు చేయడంలో విఫలం: మాజీ నేతల హెచ్చరిక



సందేశం టైమ్స్, నందిగామ, మార్చి 25, ప్రతినిధి: లపాడు మండలం పెద్దాపురం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నందిగామ పరిధిలో పూల శెనగ, పెసర, మొక్కజొన్న మరియు ఇతర పంటలను రైతులు పండించినప్పటికీ కూటమి ప్రభుత్వం కొనుగోలు చేయడంలో విఫలమై, ఆ లోపాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీపై మోపడం నిందనీయమని మండల పార్టీ కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, మాజీ జెడ్పిటిసి సభ్యులు కోటేరు ముత్తారెడ్డి తెలిపారు.వీరు అన్నారు, నందిగామ నియోజకవర్గంలో రైతుల పంటలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమై, రైతుల ఆవేదనను పక్కన పెట్టి ప్రత్యక్షంగా వివక్ష చూపుతోంది. మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు, శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్ నేతృత్వంలో పూర్వ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రబీ, ఖరీఫ్ పంటలను కొనుగోలు చేసి 15 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేసి, పంటల భీమా పథకం ద్వారా ప్రతీ రైతుకు నష్టపరిహారం అందించిన ఘనతను గుర్తుచేశారు.వీరు హెచ్చరించారు, కూటమి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో అక్రమంగా రూ.300 క్వింటాకు వసూలు చేస్తూ రైతుల పంటను కొనుగోలు చేయకపోవడం, తప్పును ఇతర పార్టీపై మోపడం సమంజసం కాదు. అలాగే, గ్రామాభివృద్ధి, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయం, హెల్త్ సెంటర్స్, దేవాలయ నిర్మాణాలలో గత వైఎస్ఆర్ ప్రభుత్వం చేసిన ప్రగతి ను తలచి, రైతుల పంటలను సకాలంలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షులు జంగా కోటిరెడ్డి, ఆవుల ప్రసాదు, సర్పంచి చలమల దుర్గయ్య, ఎంపిటీసీ సభ్యులు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, రైతులు కోట సంగయ్య, మట్టూరి సాయిబాబు, ఎడ్లపల్లి సత్యనారాయణ మరియు ఇతరులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.